క్లుప్తంగా

నేడు ఊరేళ్లలో ఉచిత మెగా వైద్యశిబిరం

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని ఊరేళ్లలో టీఎక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి తెలిపారు. చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పేద ప్రజలకు సరైన వైద్యం అందించాలనే ఆలోచనతో ఈ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం ఉంటుందని చెప్పారు. గ్రామంలోని పేద ప్రజలు, గ్రామస్తులందరూ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్యశిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలతో పాటు దంత, కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు గురుకులాల్లో ప్రవేశ పరీక్ష

మొయినాబాద్‌రూరల్: గురుకులాల్లో చేరే విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా రాత పరీక్ష నిర్వహిస్తున్నామని సాంఘిక సంక్షేమ మహిళా వికారాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కోట అన్నారు. ఆమె శనివారం మాట్లాడుతూ.. 5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు ఆదివారం గురుకులాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారని సూచించారు. ఇందుకు విద్యార్థులు 9 గంటల వరకు సంబంధిత కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. వికారాబాద్ డిగ్రీ కళాశాలలో 550 మంది విద్యార్థులకు సెంటర్ ఏర్పాటు చేశామని, మొయినాబాద్ మండలంలోని టోల్‌కట్ట సమీపంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాల కలదని తెలిపారు.

నేటి నుంచి మండలస్థాయి క్రికెట్ పోటీలు

చేవెళ్ల: మండలంలోని యువత కోసం మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకుడు పర్మన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెద్దోళ్ల దయాకర్ తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పెద్దోళ్ల పర్మయ్య పేరుపై ఈ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఆదివారం నుంచి పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పోటీలలో మండలస్థాయి జట్లకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నామని, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన యువత ఈ పోటీలలో పాల్గొనేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ పోటీలలో అంపైర్‌లదే తుది నిర్ణయమని, ప్రతి రోజు రెండు మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఎవరైనా పాల్గొనాలంటే ముందుగా నిర్వాకులను కలిసి ఎంట్రీ ఫీజు రూ.2,500 కట్టి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీలలో విజేత జట్టుకు రూ.50వేలు, రన్నరప్ జట్టుకు 25,000లు ట్రస్ట్ ద్వారా అందజేస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం నిర్వాహకులు సురేందర్ రెడ్డి, కే.మహేందర్, పి.శ్రీధర్ ఫోన్ నెంబర్లు 9573325933, 9666017852, 8247755361లను సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పల్లకీసేవ



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌదమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి పల్లకీ సేవకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచార్య, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, మాజీ కౌన్సిలర్ లతాశ్రీ, భక్తులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



పూజలో పాల్గొన్న శివస్వాములు

కొందుర్గు: శివమాల ధరించిన స్వాములు శనివారం శ్రీశైలం బయలుదేరారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడ గ్రామంలో గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పూజలో స్వామివారి భక్తిగీతాలతో గ్రామంలోని వీధులు మార్మోగాయి. అనంతరం స్వాములకు ఇరుముళ్ల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల శివస్వాములు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

గ్రామాల్లో కొన్నేళ్ల క్రితం విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి షాక్ కొడుతున్నాయి. సమీప ఇళ్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చాలా ఏళ్లుగా స్తంభాలు మార్చకపోవడంతో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని, అధికారులు స్పందించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- జనావాసాల్లో తుప్పుపట్టిన విద్యుత్ ఇనుప స్తంభాలు
- ఇళ్లపై వేలాడుతున్న తీగలు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బాకారంలో స్తంభం షాక్ వస్తుడడంతో చుట్టూ కట్టిన వస్త్రం



ఇంటిని ఆనుకొని ఉన్న ఇనుప స్తంభం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని బాకారం గ్రామంలో ఇనుప స్తంభాలు తుప్పుపట్టి విద్యుత్ షాక్ కొడుతోంది. గత కొన్నేళ్ల క్రితం వేసిన స్తంభాలు తుప్పుపట్టి, విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదాలకు నిలయంగా మారడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్నిచోట్ల తుప్పుపట్టి విద్యుత్ సరఫరా అవుతున్న స్తంభాలకు స్థానిక ప్రజలు వస్త్రం చుట్టి తాళ్లు కట్టారు. కొన్నేళ్ల నుంచి మండల సర్వసభ్య సమావేశంతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

50 ఏళ్ల క్రితం ఏర్పాటు..

బాకారం గ్రామంలో 50 ఏళ్ల క్రితం విద్యుత్ సరఫరా కోసం అధికారులు ఇనుప స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ స్తంభాలపై 11కేవీ విద్యుత్ సరఫరా జరుగుతోంది. వర్షాకాలంలో ఈ విద్యుత్ స్తంభాలకు వివిధ వైర్లు ఉండడంతో అర్తింగ్‌తో కరెంటు షాక్ వస్తోంది. ప్రస్తుతం అక్కడక్కడ ఇనుప స్తంభాలు తుప్పుపట్టి ఎండాకాలంలోనే కరెంటు సరఫరా అవుతుండడంతో బట్టలు చుట్టి తాళ్లు కట్టారు. ఇప్పటికే ఎన్నో మూగజీవాలు మరణించాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అప్పట్లో కోటి రూపాయలు నిధులు కేటాయించింది. అయినా బాకారం గ్రామంలో ఒకటి, రెండు స్తంభాలు తొలగించి అధికారులు చేతులు దులుపుకున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో ప్రస్తుతం దాదాపు 30కి పైగానే ఇనుప స్తంభాలు ఉన్నాయని, వర్షాకాలంలో ప్రమాదకరంగా మారుతాయని.. ప్రస్తుతం అక్కడకక్కడా తుప్పుపట్టిన స్తంభాలకు ఇప్పుడు కరెంటు షాక్ వస్తుందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇనుప స్తంభాలు తొలగించాలి



బాకారం గ్రామంలో దాదాపు 30కి పైగానే ఇనుప స్తంభాలు ఇళ్ల పక్కన, రోడ్డు మధ్యలోనే ఉన్నాయి. అప్పుడప్పుడు విద్యుత్ షాక్ వస్తున్నాయి. వర్షాకాలంలో అయితే ఈ స్తంభాల వద్దకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. వర్షాకాలంలో నీటితో ఇళ్లకు అర్తింగ్ వస్తోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. ప్రమాదాలు జరగకముందే ఇనుప స్తంభాలను తొలగించాలి.

– కొత్తపల్లి తిరుపతిరెడ్డి, మాజీ వార్డుసభ్యుడు, బాకారం

తొలగించేందుకు కృషి చేస్తున్నాం

బాకారం గ్రామంలో కొన్ని ఇనుప స్తంభాలను తొలగించేందుకు కృషి చేస్తున్నాం. ఆ గ్రామంలో 11కేవీకి సంబంధించిన ఇనుప స్తంభాలు ఉన్నాయి. పైఅధికారుల నుంచి వాటిని తొలగించాలని అనుమతి వచ్చింది. గ్రామంలో స్తంభాలను తొలగించడానికి కావాల్సిన డీడీని చెల్లించాలి. ప్రమాదం ఉన్నచోట వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అక్కడకక్కడా ఇనుప స్తంభాలకు గోనె సంచులు, బట్టలు చుట్టిన విషయం తమ దృష్టికి రాలేదు, అయినా తెలుసుకొని పరిష్కరిస్తాం.

– హమునాయక్, విద్యుత్ ఏఈ

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



పాఠశాలకు ప్రాజెక్టర్, ప్రింటర్లను అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత రంగాల్లో స్థిరపడాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని గుంట్లవెల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు శనివారం హైదరాబాద్‌కు చెందిన బుద్దాస్ లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ సంస్థ యాజమాన్యం ప్రాజెక్టర్, ప్రింటర్లను బహూకరించారు. ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారాలను, మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలని వారు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షురాలు వెనిరబుల్ ఉపేక్ష మాతాజీ, సభ్యులు అరుణాకుమారి, నాగయ్య, సుజాత, సిద్దార్థ, భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు మన్నాన్, గౌరీశ్వరీ, దేవి ప్రసూన, బ్రహ్మచారి, రాజకుమారి, మల్లయ్య, గ్రామస్తులు లక్ష్మారెడ్డి, బాల్‌రాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల ప్రోత్సాహం అవసరం



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఏఎంఆర్ ట్రస్టు చైర్మన్ ఎలుగంటి అభిరామ్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు 850 పరీక్ష ప్యాడ్లు, బాక్స్‌లు, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు దాతలు సహకరిస్తే వారు మరింత ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చెప్పారు. తాము సంపాదించిన దాంట్లో కొంత డబ్బు పేద విద్యార్థుల కోసం ఖర్చు చేస్తానని తెలిపారు. అనంతరం వారు విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు రవీందర్‌నాయక్, మునగపాటి నర్సింలు, నాయకులు సూర్యగౌడ్, జంగయ్య, శ్రీనివాస్, శేఖర్, ఆంజనేయులు, ఖాసిఫ్, రఫిక్, దయాకర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కేశంపేట: మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో గల శివాలయంలో శివపార్వతుల కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్, కవిత దంపతులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్యన ఘనంగా జరిపించారు. ఈ మహోత్సవంను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మంత్రికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

కొత్తూరు: మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో ఉన్న అనంతపద్మనాభస్వామి ఆలయంలో నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించారు. ఇందులో భాగంగా శనివారం ఆయన పలువురు నాయకులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనంతపద్మనాభస్వామి ఆలయం చాలా ప్రసిద్ధి చెందిందని, కోరిన కోరికలు తీరుతాయనే నమ్మకంతో స్థానికులతో పాటు పక్క జిల్లాల నుంచి సైతం భక్తులు స్వామిని దర్శించుకోవడానికి వస్తుంటారని వివరించారు. ఆలయ పునర్నిర్మాణ పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్)ను రద్దు చేయాలని బీజేపీ యువ నాయకులు కల్యకోలు తిరుపతి అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిందన్నారు. ఎన్నికల హామీలో ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత వసూలు చేయాలని చూస్తోందన్నారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పి, రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన హెచ్చరించారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను అమలు చేసే తీవ్రస్థాయిలో కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించినట్లు తెలిపారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎందుకు ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను అమలు చేస్తుందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునేందుకే ఎల్‌ఆర్‌ఎస్‌ను తిరిగి ప్రారంభించినట్లు వివరించారు. ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే హామీలను అమలు చేయాలన్నారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి

ఎస్‌ఐ శిరీష, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు



క్రీడాకారుడికి బహుమతి అందిస్తున్న ఎస్‌ఐ శిరీష, ఏబీవీపీ నాయకులు

చేవెళ్ల: విద్యార్థులు తమ లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు నిరంతరం కృషి చేయాలని ఎస్‌ఐ వనం శిరీష అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌ఐ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల కోసం ఏబీవీపీ ఇలాంటి పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు వారు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కల్యాణ్ సూర్యప్రకాశ్, జిల్లా కన్వీనర్ చందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహిపాల్, నగర అధ్యక్షుడు శ్రీశైలం, హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నితీశ్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ప్రిన్సిపాల్‌కు అభినందన



ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రిన్సిపాల్ నీతా

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినుల ఉన్నతికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా ప్రోత్సాహం అందిస్తున్నారు. శనివారం సికింద్రాబాలోని హోటల్ యాత్రినివాస్‌లో భారతీయ యువశక్తి ట్రస్(బిస్ట్) ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి హాజరయ్యారు. భారతీయ యువశక్తి ట్రస్(బిస్ట్) సంస్థ విద్యార్థినులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తుంది. అందులో భాగంగా విద్యార్థినుల అభ్యున్నతికి ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పాటుపడుతున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రిన్సిపాల్‌ను అభినందిస్తూ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



ఆలయ సభ్యులకు చెక్కు అందజేస్తున్న సోమిరెడ్డి నరేందర్‌రెడ్డి

షాద్‌నగర్: మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ దేవాలయ నిర్మాణానికి ఎంఎన్‌ఆర్ సేవా సంస్థల అధినేత సోమిరెడ్డి నరేందర్‌రెడ్డి శనివారం రూ.2లక్షల 21వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు విరాళానికి సంబంధించి చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో భవానీ మాత ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రాజు, గ్రామస్తులు శ్రీపతిరెడ్డి, యాదయ్య, రామస్వామి, ఆర్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన

కొందుర్గు: మూఢనమ్మకాలను నమ్మొద్దని హెచ్‌ఎం గోపినాథ్ విద్యార్థులకు సూచించారు. కొందుర్గు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్ విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మూఢనమ్మకాలను నిరూపించే పలు రకాల ప్రయోగాలను చేసి చూపించారు. ఇప్పటికీ గ్రామాల్లో చేతబడులు, బానమతులు అంటూ ప్రజలు మూఢనమ్మకాలను పాటిస్తూ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

చేవెళ్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో శనివారం కమిషనర్ పూర్ణచందర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్, సబ్బులు, నూనెలు, గ్లౌజు, షూ తదితర వాటిని అందించాలని కోరారు. కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్, ప్రమాద బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీ కావటంతో కార్మికులకు చట్ట ప్రకారం రావాల్సిన అని వసతులు, సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ సభ్యులు, కార్మికులు ఉన్నారు.

మోడల్ హౌస్ నిర్మాణానికి స్థల పరిశీలన

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో మోడల్ హౌస్ నిర్మించాలని నిర్ణయించారు. నియోజకవర్గంలోని పేదలందరికీ ఇల్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హిమబిందు, పార్టీ నాయకులు, అధికారులు ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు